21 నుంచి బీఈడీ పరీక్షలు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 19 : కాకతీయ యూనివర్సిటీ పరిధిలో బీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు (రెగ్యులర్, ఎక్స్ ఇంప్రూవ్‌మెంట్) ఈ నెల 21వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణ అధికారి ఎస్ నర్సింహచారి, అదనపు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఈ నెల 21, 23, 26, 28, 30, ఏప్రిల్ 1వ తేదీల్లో పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఏప్రిల్ 25 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 19 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఓపెన్ స్కూల్ విధానంలో అడ్మిషన్ పొంది పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఏప్రిల్ 25 నుంచి మే 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ప్రణీత ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5.30 గంటల వరకు, ఇంటర్మీడియట్ (టీవోఎస్ఎస్) ప్రాక్టికల్ పరీక్షలు మే 3 నుంచి 10వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అధ్యయన కేంద్రాల కోఆర్డినేటర్లు, ఈ విషయాన్ని అభ్యాసకులకు తెలియజేస్తూ, విస్తృత ప్రచారం చేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సాఫ్ట్ స్కిల్స్‌పై శిక్షణ

మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్

ఆదిలాబాద్ రూరల్, మార్చి 19 : ఆదిలాబాద్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సైన్సెస్‌లో టీఎస్ కేసీ ఆధ్వర్యంలో టాస్క్ వారి సౌజన్యంతో 21వ శతాబ్దపు బదిలీ చేయగల నైపుణ్యాలు (సాఫ్ట్ స్కిల్స్)పై మంగళవారం విద్యార్థులకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ 21వ శతాబ్దంలో విద్యార్థులు జీవితంలో స్థిరపడాలంటే సాఫ్ట్ స్కిల్స్‌లో ప్రావీణ్యత పొందడం అత్యంత ప్రధానమైందన్నారు. ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల టీఎస్ కేసీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం నర్సింగరావ్, మెంటర్ ఎండీ ఇమ్రాన్ అలీ, టాస్క్ శిక్షకుడు రామమనోజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పదో తరగతి పరీక్షలు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 19 : ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా పదో తరగతి పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 53 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. 10407 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 10359 మంది హాజరయ్యారు. 46 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఈవో ప్రణీత తెలిపారు.

ప్రతి కూలీకి పని కల్పిస్తాం

నార్నూర్, మార్చి 19 : జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి వంద రోజుల పని కల్పిస్తామని ఈజీఎస్ ఏపీవో జాదవ్ సురేశ్ అన్నారు. గుండాల గ్రామంలో చేపట్టిన ఉపాధి హామీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. కూలీల సంఖ్యను పెంచాలని టెక్నికల్ అసిస్టెంట్ జాదవ్ కైలాస్‌కు సూచించారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

ఇచ్చోడ, మార్చి 19 : వైరస్ వల్ల వచ్చే వ్యాధుల నుంచి తమ పశువులను కాపాడుకునేందుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశు వైద్యాధికారి గోవింద్ నాయక్ అన్నారు. మంగళవారం కోకస్‌మన్నూర్ గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది శేఖర్, దేవ్‌రావ్, రైతులు పాల్గొన్నారు.

సిరికొండకు బస్సు నడపండి సార్..

- వారం రోజుల నుంచి బంద్
- ప్రైవేట్ వాహనాల్లోనే ప్రయాణం
- బస్సు రాకపోవడంతో పదో తరగతి విద్యార్థులకు ఇబ్బందులు

సిరికొండ బస్టాండ్‌లో ప్రైవేట్ వాహనాల కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు

ఇచ్చోడ(సిరికొండ), మార్చి 19 : సిరికొండ మండలానికి ఆర్టీసీ బస్సు రాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు విన్నవించడంతో సిరికొండ నుంచి ఇచ్చోడకు ఉదయం ఒక ట్రిప్పు, సాయంత్రం ఒక ట్రిప్పు ఆర్టీసీ అధికారులు బస్సు నడిపేవారు. వారం రోజుల నుంచి బస్సు బంద్ చేయడంతో 25 గ్రామాల ప్రజలు ఆటో, జీపుల్లో ప్రయాణిస్తున్నారు. వివిధ పనులు నిమిత్తం ఇచ్చోడకు వెళ్లేందుకు 15 కిలో మీటర్లకు రూ.25 నుంచి రూ.30 చెల్లిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం అంటూ ప్రచారం చేస్తున్నది తప్ప మండలాలకు బస్సులు నడపడం లేదు.

పదో తరగతి విద్యార్థులకు అవస్థలు

సిరికొండ మండలంలోని పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇచ్చోడలో పరీక్షా కేంద్రం ఉండడంతో బస్సులు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి చదువుకుంటున్న 30 మంది, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 41 మంది, రాయిగూడ ఆదర్శ పాఠశాల 31 మంది విద్యార్థులు బస్సు రాకపోవడంతో రూ.50 చెల్లిస్తూ ఆటో, జీపుల్లో ప్రయాణం చేస్తున్నారు. పరీక్ష సమయానికి చేరుకునేందుకు ఉదయం నుంచి ప్రైవేట్ వాహనాల కోసం ఎదురు చూస్తున్నారు. వాహనాలు రాకపోతే పరీక్ష ఎలా రాయాలో ఆందోళనకు గురవుతున్నారు. విద్యార్థులు, మహిళలు, గ్రామస్తులు, ఉద్యోగులు ఆర్టీసీ బస్సు లేక ప్రైవేట్ వాహనాలకు డబ్బులు చెల్లిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ఆర్టీసీ అధికారులు సిరికొండకు బస్సు నడిపితే ఇబ్బందులు తప్పుతాయని విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

ఆటోలో వెళ్తున్న సిరికొండ కేజీబీవీ విద్యార్థినులు

బస్సు లేక ఇబ్బంది పడుతున్నాం

నేను జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో చదువుతున్నాను. నా పరీక్షా కేంద్రం ఇచ్చోడలో ఉండడంతో ఆర్టీసీ బస్సు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాను. ప్రతి రోజూ రూ.50 ప్రైవేట్ వాహనాలకు చెల్లిస్తున్నాను. ఉచిత ప్రయాణం ఉండి కూడా ఆర్థికంగా నష్టపోతున్నాం. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు నడపాలి.

-సీ నీత, పదో తరగతి విద్యార్థిని, సిరికొండ

గాలివాన దుమారం

- ఇండ్లపై నుంచి ఎగిరిపోయిన రేకులు, దెబ్బతిన్న పంటలు
- నేలకూలిన చెట్లు

జైనథ్ : మేడిగూడలో నేలకొరిగిన నువ్వులు, జొన్న పంట

జైనథ్, మార్చి 19 : మండల కేంద్రంతో పాటు మండలంలోని లక్ష్మిపూర్, దీపాయిగూడ, ఆనంద్‌పూర్, కూర, మేడిగూడ గ్రామాల్లో మంగళవారం మధ్యాహ్నం భారీ గాలులు, ఉరుములు, మెరుపులు, వడగండ్లతో కూడిన వర్షం కురిసింది. రైతులు సాగు చేస్తున్న జొన్న, నువ్వు, మక్క పంటలు నేలకొరగడంతో పంటలకు తీవ్ర నష్టం జరిగింది.

బోథ్‌లో ..

బోథ్, మార్చి 19 : బోథ్, కౌఠ(బీ), సొనాల, పట్నాపూర్ గ్రామాల్లో కోత దశలో ఉన్న జొన్న, గోధుమ, మక్క పంటలకు నష్టం వాటిల్లింది. పూత దశలో ఉన్న నువ్వు పంటకు స్వల్పంగా నష్టం వాటిల్లింది. అక్కడక్కడ గాలికి చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. గ్రామాల్లోని అంతర్గత రోడ్లు వర్షంతో చిత్తడిగా మారాయి.

ఇచ్చోడ, సిరికొండలో..

ఇచ్చోడ(సిరికొండ), మార్చి 19 : సిరికొండ మండలం లఖంపూర్, రాంపూర్ గ్రామాల్లో ఇండ్లపై నుంచి రేకులు ఎగిరిపోయాయి. ఆయా గ్రామాల్లో జొన్న, గోధుమ పంటలు నేలకొరిగాయి.

ఇంద్రవెల్లి మండలంలో..

ఇంద్రవెల్లి, మార్చి 19 : మండలంలోని గలియబాయితండాలోని విజయలక్ష్మి జిన్నింగ్ మిల్లులోని సీసీపై కేస్లాగూడ గ్రామానికి చెందిన రైతులు మక్క పంటను అరబెట్టారు. మంగళవారం మధ్యాహ్నం కురిసిన అకాల వర్షంతో విద్యాసాగర్, వేముల కిరణ్, రాధాబాయి, ఇమ్రాన్‌బేగ్, మంజురుబేగ్ రైతులకు చెందిన దాదాపు 600ల క్వింటాల్ల మక్కలు తడిసిపోయాయి. రాష్ట్ర ప్రభుత్వం సర్వే నిర్వహించిన పంటనష్టం జరిగిన వారిని ఆర్థికంగా ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు.

తలమడుగులో..

తాంసి(తలమడుగు), మార్చి 19 : తలమడుగు మండలం మదనపూర్, బరంపూర్, నందిగామతో పాటు ఆయా గ్రామాల్లో వడగండ్ల వర్షం కురిసింది. రైతులు పండించిన పంటలకు నష్టం వాటిల్లింది. మరోవైపు తాంసి మండలం పొన్నారి, జామిడి, వడ్డాడి, కప్పర్ల, తాంసి(బీ), గిరిగామ గ్రామాల్లో గంటపాటు ఎడతెరిపిలేని వర్షం కురిసింది. కోత దశలో ఉన్న కంది పంట తడిసినట్లు రైతులు తెలిపారు.

బజార్‌హత్నూర్ మండలంలో..

బజార్‌హత్నూర్, మార్చి19 : మండలంలోని గిర్నూర్, పిప్పిరి, దేగామ, బజార్‌హత్నూర్, జాతర్ల గ్రామాల్లో ఈదురు గాలులతో వర్షం కురిసింది. యాసంగి పంటలైన మక్క, జొన్న, నువ్వు పంటలు నేలకొరిగాయి. అంతే కాకుండా ఇంటిపై కప్పులు లేచి పోయాయి. అక్కడక్కడ విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో మండలంలో కొన్ని గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. కురిసిన అకాల వర్షంతో రైతన్నలు పంటలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అసలే ఎండ వేడితో ఇబ్బంది పడుతున్న ప్రజలు ఒక్క సారిగా వాతావరణం చల్లబడడంతో ఉక్కపోత నుంచి సేద తీరారు.

బోథ్‌లో కురుస్తున్న వర్షం

ఇచ్చోడ: సిరికొండ మండలం లఖంపూర్‌లో ఎగిరిపోయిన ఇంటి కప్పు

బజార్‌హత్నూర్ : నేలకొరిగిన జొన్న పంట

శబరిమాతాజీ ఆశ్రమ వార్షికోత్సవం

బోనం వేయడానికి వెళ్తున్న మహిళలు

బోథ్, మార్చి 19: కౌఠ(బీ) గ్రామంలో శ్రీ సద్గురు శబరిమాతాజీ ఆశ్రమ 12వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం రుద్రయాగం నిర్వహించారు. వేద పండితులు సదానందశర్మ మంత్రోచ్చారణల మధ్య దంపతులు హోమం నిర్వహించారు. అనంతరం మహిళలు ఊరేగింపుగా వెళ్లి ఊర పోచమ్మ, ముత్యాల పోచమ్మ, మహాలక్ష్మీ పోచమ్మ, సార్గమ్మ పోచమ్మకు బోనాలు వేశారు. ఆశ్రమంలో భక్తులను ఉద్దేశించి శివానంద భారతి స్వామిజీ, దేవన్న మహారాజ్, బాలన్న, పద్మనాభం గురుస్వామిలు ప్రవచనాలు బోధించారు. బుధవారం అమ్మవారి విగ్రహానికి అభిషేక పూజలు, శోభాయాత్ర చేపట్టనున్నారు. గ్రామంతో పాటు దేగామ, పిప్పిరి, కన్గుట్ట, కుచులాపూర్, పొచ్చెర, ధన్నూర్(బీ) గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చారు.

గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు

నార్నూర్, మార్చి 19 : గర్భిణులకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వైద్యాధికారి రాంబాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్యం కేంద్రంలో నార్నూర్ సబ్ సెంటర్ పరిధిలోని 29మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతాశిశువు ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అప్పుడే తల్లితో పాటు శిశువు ఎదుగుదల ఆరోగ్యంగా ఉంటుందన్నారు. పౌష్టికాహారంతోనే రక్తహీనతను నివారించుకోవచ్చన్నారు. అలాగే పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఇక్కడ సీహెచ్‌వో లక్ష్మి, హెచ్ఈవో చౌహాన్ నాందేవ్, హెల్త్ సూపర్‌వైజర్ చౌహాన్ చరణ్‌దాస్, సత్తవ్వ, ఏఎన్ఎం జంగుబాయి, స్టాఫ్ నర్సు కవిత, సారిక, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
ఉచిత శిక్షణ-ఉపాధి
jobs Apply Now!
★Solar, 5G, Drone, Hardware లతో పాటు కంప్యూటర్‌లో ఉచిత శిక్షణతో పాటు ఉద్యోగ అవకాశం కల్పించబడును. Cont: PMKK, కోటక్ మహింద్ర బ్యాంక్ ఎదురుగా, మంచిర్యాల. సెల్: 7095780999, 7095906999, 7095807999.
NTK-311116

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

ఓటు హక్కును వినియోగించుకోవాలి

అవగాహన కల్పిస్తున్న కళాకారులు

ఆదిలాబాద్ రూరల్, మార్చి 19 : ఆదిలాబాద్‌లోని గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో సాంస్కృతిక కళా బృందం సభ్యులు మంగళవారం ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాకారులు ప్రదర్శనతో ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రజలకు వివరించారు. ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకొని పోలింగ్ శాతాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో రమేశ్, వెంకట్‌రావ్, రవి, నగేశ్, రాజలింగు, గోవిందరావ్, రాజు, తదితరులు పాల్గొన్నారు.

బీమా చేసుకోవాలి



బీమా చెక్కు అందజేస్తున్న మేనేజర్ కార్తిక్ కుమార్

ఉట్నూర్ రూరల్, మార్చి 19 : ప్రతి ఒక్కరూ బీమా చేసుకోవాలని ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ ఆదిలాబాద్ బ్రాంచ్ మేనేజర్ కార్తిక్ కుమార్ అన్నారు. హీరాపూర్ గ్రామానికి చెందిన రాథోడ్ ఊర్మిళ కొద్ది రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందింది. ఊర్మిళ గత సంవత్సరం జులై నెలలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ 5000 బీమ పాలసీ చేశారు. మృతి చెందిన అనంతరం లైఫ్ ఇన్సూరెన్స్ వారు రూ. 4,75,000ల చెక్కును మృతురాలి తల్లిదండ్రులకు అందజేశారు. కార్యక్రమంలో ఏజెన్సీ మేనేజర్ సురేశ్ నాయక్, లైఫ్ మిత్ర అడ్వాయిజర్ జాదవ్ వసంత్‌రావ్ పాల్గొన్నారు.

ఎంపిక పోటీలో సత్తా చాటిన క్రీడాకారుడు

సూర్యచంద్ర తేజస్

ఆదిలాబాద్ రూరల్, మార్చి 19 : ప్రో క్రికెట్ ఛాంపియన్‌షిప్ ట్రోఫి-2 సెలక్షన్ ఎంపిక ప్రక్రియలో ఆదిలాబాద్ జిల్లా యువకుడు సత్తా చాటాడు. ఆదిలాబాద్‌లోని కేంద్రీయ విద్యాలయంలో ఐదో తరగతి చదువుతున్న సూర్యచంద్ర తేజస్ ప్రతిభను కనబరిచారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రో క్రికెట్ ఛాంపియన్‌షిప్ ట్రోఫి ద్వారా నిర్వహించిన ఎంపిక సెలక్షన్‌లో ఆల్ రౌండర్ సత్తా చాటి అండర్-14 టీంలో అర్హత సాధించాడు. ఆదివారం ఢిల్లీల్లో నిర్వహించే అండర్-14 మ్యాచ్‌లో పాల్గొంటారని తెలిపారు. సూర్యచంద్ర తేజస్‌కు కోచ్ పటాస్కర్ అభినందనలు తెలిపారు.

మట్కా నిందితుడి అరెస్టు

ఎదులాపురం, మార్చి 19 : ఆదిలాబాద్ పట్టణంలోని ఖుర్షీద్‌నగర్‌లో మంగళవారం మట్కా నిర్వహిస్తున్న అబ్దుల్ సలాంను అరెస్టు చేసి అతని వద్ద నుంచి రూ.4330 నగదు, మట్కా చిట్టీలు స్వాధీనం చేసుకున్నామని సీసీఎస్ సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జిల్లాలో ఎటువంటి సమాచారమైన సెల్ నంబర్ 8712659965 నంబర్‌కు అందించవచ్చని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

విద్యుత్ కోతలు లేకుండా చూడండి

ఎదులాపురం, మార్చి 19 : పదో తరగతి పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో రాత్రి వేళలో విద్యుత్ కోతలు లేకుండా చూడాలని సార్క్ హ్యూమన్ రైట్స్ ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి నీరటి ఉదయ్ కిరణ్ అన్నారు. ఈ విషయమై కలెక్టర్ రాజర్షి షాను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం ఇచ్చారు. కొద్ది రోజులుగా విద్యుత్ కోతలతో విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని తెలియజేయగా కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు.

పకడ్బందీగా పదో తరగతి పరీక్షలు నిర్వహించాలి

బజార్‌హత్నూర్: ఆదర్శ పాఠశాలలో పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్

బజార్‌హత్నూర్, మార్చి 19 : పదో తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షిషా సూచించారు. మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి పరీక్షా కేంద్రాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులు పరీక్ష రాస్తున్న తీరును పరిశీలించారు. పాఠశాల సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానను సందర్శించారు. పలు రికార్డులు పరిశీలించారు. మండలంలోని ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. మహిళా ఆరోగ్య కేంద్రాన్ని, పలు వార్డులను పరిశీలించారు. మహిళా ఆరోగ్య కేంద్రంలో అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అంతేకాకుండా వార్డులలోని రోగులతో మాట్లాడి వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా విద్యాధికారి ప్రణీత, తహసీల్దార్ శంకర్, విద్యాధికారి శ్రీకాంత్, ఎంపీడీవో శ్రీనివాస్, వైద్యాధికారులు భీంరావ్, శిల్ప, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ అధికారుల శిక్షణ

ఎదులాపురం, మార్చి 19 : కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజర్షి షా మంగళవారం ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ అధికారులకు మోడల్ కోడ్ కండక్ట్, సివిజిల్ అంశంపై అవగాహన కల్పించారు. భారత ఎన్నికల సంఘం ప్రారంభించిన సివిజిల్ యాప్, ఫాస్ట్‌ట్రాక్ ఫిర్యాదు స్వీకరణ, పరిష్కార వ్యవస్థను రూపొందిస్తున్నదని తెలిపారు. సివిజిల్ అనేది ఎన్నికల సమయంలో మోడల్ ప్రవర్తన నియామవళి, వ్యయ ఉల్లంఘనలు నివేదించడానికి పౌరుల కోసం ఒక వినూత్న మొబైల్ ఆప్లికేషన్, సివిజిల్ అంటే విజిలెంట్ సిటిజన్ స్వేచ్ఛ, నిష్పక్షపాత ఎన్నికల నిర్వహణలో పౌరుల పోషించగల క్రియాశీల, బాధ్యతాయుతమైన పాత్రను నొక్కి చెబుతుందన్నారు. జాతీయ సంప్రదింపు కేంద్రానికి 1800111950, 1950 రాష్ట్ర సంప్రదింపు కేంద్రానికి కాల్ చేయమని ప్రోత్సహించాలన్నారు.

స్వయం ఉపాధి కోసమే ఉచిత శిక్షణ



సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న ఏపీఎం మైస రమేశ్

నార్నూర్, మార్చి 19 : మహిళలు, యువతులు స్వయం ఉపాధితో అభివృద్ధి చెందాలని ఉచిత శిక్షణ ఇచ్చామని ఐకేపీ ఏపీఎం మైస్ రమేశ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఇందిరాక్రాంతి పథం (సెర్ప్) కార్యాలయంలో శిక్షణ పూర్తి చేసిన మహిళలు, యువతులకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మగ్గం వర్క్ శిక్షణ పొందిన మహిళలను అభినందించారు. ఈ శిక్షణతో స్వయంగా ఉపాధి పొందాలన్నారు. రానున్న రోజుల్లో కుట్టు మిషన్ వచ్చిన వారికి స్కూల్ యూనిఫాంలు కుట్టుటకు అవకాశం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో సీసీలు కాంబ్లే సంతోష్, రాథోడ్ సంతోష్, జాదవ్ కిషన్ రావ్, శిక్షణ పొందిన మహిళలు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన

తాంసి(తలమడుగు), మార్చి 19 : తలమడుగు మండలం బరంపూర్, పల్లి(కే), పల్లి(బీ), మదనపూర్, నందిగాం గ్రామాల్లో కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్న జొన్న, పొగాకు, మక్క పంటలను జేడీ పుల్లయ్య, జడ్పీటీసీ గణేశ్‌రెడ్డితో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ పంట నివేదికలు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకుంటామన్నారు. మండలంలో 400 మంది రైతుల పంట పొలాల్లో 900 ఎకరాలకు పైగా మక్క, జొన్న, పొగాకు పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయ అధికారులు వెల్లడించారు. వారి వెంట ఏవో మహేందర్, ఏఈవో శ్రావ్య, రైతులు ఉన్నారు.

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

తాంసి(తలమడుగు), మార్చి 19: బోథ్ నియోజకవర్గంలో అకాల వర్షానికి పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. మంగళవారం తలమడుగు మండలం ఆయా గ్రామాలతో పాటు పల్లి(బీ)లో పర్యటించి వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకాల వర్షాలతో మక్క, జొన్న, పొగాకు పంటలకు తీవ్ర నష్టం జరిగిందని అన్నారు. పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు నష్టపరిహారం తక్షణమే ఎకరాకు రూ.50 వేలు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కిరణ్ కుమార్, కల్పప్ యాదవ్, నాగిరెడ్డి, వెంకటేశ్, తిరుపతి, మున్నా, చందు, అశోక్, మల్క్, రంజిత్ రెడ్డి, గంగాధర్, సురేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మాశకు ఆశపడి మహిళ చోరీ

జైనథ్, మార్చి 19 : మాకోడ గ్రామంలో ఈ నెల 11వ తేదీన నిమ్మల రవికాంత్ రెడ్డి ఇంట్లో పట్టపగలు చోరీ జరిగిందన్న ఫిర్యాదు మేరకు అదే రోజు సంఘటన స్థలాన్ని జైనథ్ సీఐ సాయినాథ్, ఎస్ఐ పురుషోత్తం పరిశీలించారు. అదే గ్రామానికి చెందిన లక్ష్మి అనే మహిళ ఇంట్లో ఎవరు లేని సమయంలో రవికాంత్ రెడ్డి ఇంటికి తాళం వేసి తాళం చెవి ఇంటి ఎదుట ఉన్న గూట్లో పెట్టడాన్ని గమనించి ఆ ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని సుమారు నాలుగు తులాల బంగారం ఆభరణాలు, రూ.40 వేల నగదు దొంగలించినట్లు పోలీసులు విచారణలో ఒప్పుకుంది. పోలీసులు ఆమె వద్ద నుంచి బంగారు ఆభరణాలు, రూ.39 వేల నగదు సీజ్ చేశారు. దొంగతనం చేసిన మహిళను రిమాండ్ పంపించామని తెలిపారు.